పితే ఏమవుతుంది? ”

“ఏమో సర్!”

“తిండిలేక అందరూ ఛస్తారు”

‘ఛ’ అక్షరాన్ని ఒత్తి పలుకుతూ అన్నాడు మల్హోత్రా.

ఆమె ఏమీ మాట్లాడలేదు.

“కొంతమంది మనుషులయినా పూజ చెయ్యటం ఆపి, పని చెయ్యబట్టి మీలాంటి వారికి తెలిగ్గా ఆకలి తీరి పూజ చేసుకునే వెసులుబాటు దొరికింది...”

“నేను నా అభిప్రాయం ఇంకొక రకంగా చెప్తాను. రోజంతా పూజ చేయవలసిన అవసరం లేదు. కానీ రోజుకి కాసేపు ఎవరి తీరికను అనుసరించి వారు పూజ చేస్తే తప్పు లేదుగా!” అందామె.

“గుడ్! అయితే ఈ పీఠాధిపతులు, మత ప్రచారకులు, బాబాలు, స్వామీజీలు చేసేది తప్పని ఒప్పుకుంటున్నట్లేనా? ”

ఆమె ఏం చెప్పాలో తెలియక మౌనంగా ఉండిపోయింది.

“ఇంకొక మాట అడగాల్సి ఉంది. తీరిక ననుసరించి రోజుకి పది నిమిషాలు పూజ చేసినా చాలన్నావ్! ఆ మాత్రం కూడా తీరిక లేనివారు ఎవరైనా ఉంటే ఆ కాస్త పూజ చేయకపోయినా ఫరవాలేదన్నమాటేగా? ”

“రోజుకి పది నిమిషాలు తీరిక లేని వారు ఎవరుంటారు? ”

“ఒకవేళ ఉంటే? ”

“ఉంటే, పూజ చేయకపోయినా ఫర్వాలేదు” అతని వాదనతో ఏకీభవిస్తూ అంది.

“అదే నేను రుజువు చేయదలచుకుంది. నీ నోటితో నువ్వే ఒప్పుకున్నావ్!”

చెంపలు వేసుకుందామె. “ఈ టాపిక్ ఇక వదిలిపెట్టండి సర్! దేవుడి గురించి ఇలా మాట్లాడుకోవాలంటే నాకు భయం వేస్తోంది”

మల్హోత్రా రెట్టించలేదు. వాదనతో ఒక మనిషిని ఓడించడం తేలిక. అయితే ఆ మనిషి అభిప్రాయాలను, భావోద్వేగాలను మార్చటం అత్యంత కష్టం.

మనిషి తను పెట్టుకున్న నియమాలను తనే పాటించడు. ఇక దేవుడి నియమాలు ఎక్కడ పాటించగలడు?

తన సెక్రటరీని చూస్తే మల్హోత్రాకి అదే అనిపించింది. ‘ఏ సామాజిక నియమాలను అనుసరించి నువ్వు పెళ్ళి చేసుకోకుండా నాతో గడుపుతున్నావ్? నీ కోరికలు దేవుడే తీరుస్తాడన్న నమ్మకం ఉంటే పూజలు చేసుకుంటూ గడపవచ్చుగా? ’ మనసులోని మాటలను బయటకు అనకుండా అదుపు చేసుకున్నాడు.

అయితే అతనికి ఈ విషయం మీద ఆమె అభిప్రాయాలు ఇంకా తెలుసుకోవాలని ఉంది.

“నీకు దేవుడు ప్రత్యక్షమై ఒక వరం కోరుకోమంటే ఏమి కోరుకుంటావ్? ” అని అడిగాడు.

“డబ్బు! బోలెడు డబ్బు కోరుకుంటాను” అంది కళ్లు మిలమిలలాడిస్తూ.

“దానికి దేవుడ్నెందుకు కష్టపెట్టటం.. నువ్వే సంపాదించుకోవచ్చుగా? ”

“జీవితాంతం కష్టపడ్డా నాలాంటిది ఎంత సంపాదించగలదు? నాకు ఆ కాస్త చాలదు. చాలా కావాలి” అంది.

ఇంతలో ఏదో గుర్తుకు వచ్చినట్లు “నాకు ఎప్పటినుండో ఒక సందేహం సర్! మీలాగే అన్నీ ఉన్నవారికి దేవుడు ప్రత్యక్షమై వరం కోరుకోమంటే ఏమి కోరుకుంటారు? ” అని తన సందేహం వెలిబుచ్చింది.

“మిగిలిన వారి సంగతి నాకు తెలియదు. నేను మాత్రం నీకులానే బోలెడు డబ్బు కోరుకుంటాను” అన్నాడు మల్హోత్రా.

"పోండి సర్! మీరు నన్ను ఎగతాళి చేస్తున్నారు" అలిగినట్లు నటిస్తూ దూరంగా వెళ్ళిపోయిందామె.

'నేను నిజమే చెప్పాను' మనసులో అనుకున్నాడు మల్హోత్రా. 'ఇప్పుడు నాకు కావలసింది డబ్బే! నా కోసం కాదు. నామీద ఆధారపడ్డ నీలాంటి వారి కోసం' దూరంగా వెళ్తున్న సెక్రటరీని చూస్తూ అనుకున్నాడు మల్హోత్రా.

ఇంతలో అతనికి ఒక చిన్న ఆలోచన వచ్చింది. ఒక చిన్న ప్రార్థన చేయటం వలన తన సమస్యలు తీరుతాయంటే అది చేయటం వలన నష్టమేమిటి అని. అయితే అతని అహం అతని చేత ఆ పని చేయనివ్వలేదు.




**"నే**ను అధికారంలోకి వచ్చింది నా కోసం కాదు.. పేద ప్రజలకు సాధ్యమైనంత సహాయం చేయటానికి. కానీ, అదే చేయలేకపోతున్నాను" ఆక్రోశంగా అన్నాడు మహేష్. అతను ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రి.

మహేష్ నలభై సంవత్సరాల రాజకీయ నాయకుడు. మిగిలిన రంగాల్లో సంగతేమోకానీ రాజకీయాల లెక్కల ప్రకారం అతనింకా యువకుడే. ముఖ్యమంత్రి పీఠమంటే ఎలాంటి ముళ్ళ కిరీటమో అతనికి ఇప్పుడిప్పుడే తెలుస్తోంది.

అతని మంత్రివర్గ సమావేశం ముగిసింది. వారిది కొత్తగా పెట్టిన పార్టీ. యువకులంతా కలిసి అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమం చేసి ప్రజలను ఆకర్షించి అధికారంలోకి వచ్చారు. వారు అధికారంలోకి రాగలుగుతారని వారితో సహా ఎవరూ అనుకోలేదు. అందరూ కొత్తవారు కావటంతో ఇంకా రాజకీయాలకు అలవాటు పడలేదు. అతనితోపాటు మంత్రివర్గంలో ఉన్న మంత్రులందరూ అనుభవం లేనివారే! అందుకే మంత్రివర్గ సమావేశాల్లో సమాధానాల కంటే సమస్యలే బయటకు వస్తున్నాయి. తన సహచరులను ఏమీ అనుకోవటానికి లేదు. వాళ్లు పరిపాలనలో మెళకువలు నేర్చుకోవటానికి కాస్త సమయం పడుతుంది. ప్రతిపక్షాలు వారికి ఆ సమయాన్ని ఇవ్వటం లేదు.

అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుండే ఈ ప్రభుత్వం మీద దాడి మొదలయింది. ఏ చిన్న పని చేయబోయినా దానిమీద విమర్శలు తప్ప సహకరించేవారే కరువయ్యారు.

అసలే అతని ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ లేదు. ప్రభుత్వంలో చేరకుండా బయటి నుండి పానకాలు అనే నాయకుడు మద్దతు ఇస్తున్నాడు. అతని గ్రూపులో ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. వారంతా ప్రభుత్వానికి మద్దతిస్తున్నట్లు నటిస్తూ తమ పనులు చేయించుకోటానికి ప్రయత్నిస్తున్నారు. అందుకుగాను ముఖ్యమంత్రి మీద విపరీతమైన ఒత్తిడి తెస్తున్నారు.

మరొక పక్క ఆశయాల పేరు చెప్పి అతనితోపాటు పార్టీలో చేరిన నరహరి చాప కింద నీరులా తయారయ్యాడు. ఇరవై మంది ఎమ్మెల్యేలతో ప్రత్యేక గ్రూపు కట్టాడు.

అందరూ కలిసి బండిని తలా ఒక వైపు లాగుతుంటే అది ఎటూ కదలటం లేదు.

అసహనంతో విసిగిపోతున్నాడు ముఖ్య మంత్రి. తన అసహనాన్ని ఆ రోజు ముఖ్య సలహాదారు ప్రభు ముందు వెల్ల డించాడు.

ముఖ్యమంత్రి చెప్తున్న సమస్యలు వింటున్న ప్రభు సన్నగా నవ్వాడు. అతను అనేక ప్రభుత్వాలలో పనిచేసిన అనుభవ జ్ఞుడు. ఏ ముఖ్యమంత్రి దగ్గర పనిచేస్తే ఆ ముఖ్యమంత్రికి విశ్వాసంగా ఉంటాడు. అందుకే ముఖ్యమంత్రులు మారినా అతను మారడు. అన్నీ విన్న అతను ప్రశాంతంగా "మనిషి ఏది సాధించాలన్నా ప్రాణం ఉంటేనే సాధ్యం. అలానే రాజ కీయ నాయకుడు ఏది సాధించాలన్నా అధికారం అవసరం. మిమ్మల్ని మీరు కాపాడుకుంటేనే మరొకరికి సహాయం చేయగలుగుతారు. కాపాడుకోవటం అంటే నా ఉద్దేశంలో అధికారం కాపాడుకోవటం అని. ప్రజలకు సాయపడాలంటే అధికారం కావాలి. అధికారం నిలబడాలంటే తప్పుడు మార్గంలోకి నడవాలి. ఇదొక విష వలయం"

"ఆ విషవలయాన్ని ఛేదించాలనే నేను రాజకీయాలలోకి వచ్చాను. కానీ ఏమీ చేయలేకపోతున్నాను" నిరాశగా అన్నాడు మహేష్.

"మార్పు ఆహ్వానించదగిందే! కానీ అది సహజ పరిణామంలో నెమ్మదిగా వస్తేనే నిలుస్తుంది. బలవంతంగా ఏదో మార్చాల నుకుంటే కుదరదు"

"ఎందుకు కుదరదు? ప్రపంచం ఎంత త్వరగా మారుతుందో మీకు తెలుసా? అంతకుముందు చరిత్ర వదిలెయ్యండి. గత రెండు వేల ఏళ్ల చరిత్ర తీసుకుంటే మనిషి మేధస్సు క్రీస్తు పుట్టిన నాటికి ఎలా ఉందో అది రెట్టింపు కావటానికి 1500 సంవత్సరాలు పట్టింది. ఆ తర్వాత కాలం గడిచే కొద్దీ మేధస్సు వృద్ధి అయ్యే కాలం తగ్గిపోతూ వస్తోంది. ప్రజాస్వామ్య రాజ్యాలు రావటం, ఉత్పత్తి రంగంలోకి యంత్రాలు రావటం, కరెంటు, పెట్రోలు లాంటి ఇంధనాలు కనిపెట్టటం, మోటరుకారు వినియోగంలోకి రావటంతో ఇంకా త్వరత్వరగా మానవమేధ ఎదుగు తోంది. మానవ మేధస్సు నిరంతరం అభి వృద్ధి చెందుతుండడమే కాదు, అది చాలా వేగంగా పెరుగుతోంది!"

"మీరు చెప్పింది నిజమే! మనిషి మేధస్సు ఎన్నో రెట్లు పెరిగింది. అయితే ఆ పెరిగిన మేధస్సుతో మనిషి సాధిం చింది ఏమిటి? భౌతిక సుఖాలు పెరి గాయి. అదే స్థాయిలో మానసిక అశాంతి పెరిగింది. భౌతికంగా ఎన్నో రెట్లు అభి వృద్ధి సాధించాడని చెప్పుకుంటున్న మనిషి నైతిక విలువల విషయంలో ఈ రెండు వేల సంవత్సరాలలో ఎంత ఎదిగాడో తెలుసా? ఏమీ ఎదగలేదు. ఇంకా చెప్పు కోవాలంటే దిగజారాడేమో కూడా! మేధ స్సునీ, నైతిక విలువలనూ సమాన స్థాయిలో వృద్ధి చేయనంతకాలం జరుగు తున్న అభివృద్ధి అంతా కొంతమంది వద్దే మురిగిపోతుంది" ప్రభు తన అనుభ వంతో చెప్పాడు.

"మరి మనమందరం కలిసి ఆ మార్పును తెచ్చే ప్రక్రియకు కనీసం మన వంతుగానైనా శ్రీకారం చుట్టవచ్చుగా? "

"అది అంత తేలిక కాదు. ఈ వ్యవస్థ కొన్నివర్గాల చేతుల్లో ఇరుక్కుపోయి ఉంది. ముఖ్యంగా రాజకీయాలు కొందరి గుప్పిట్లో ఉండిపోయాయి. ప్రస్తుతం జరు గుతున్నది రాజకీయ నాయకుల చేత, రాజకీయ నాయకుల కోసం కొ నసాగుతున్న నాటకం. దానిలోకి తమవారు కానివారిని అంత త్వరగా రాని వ్వరు. పొరపాటున మీలాంటి వారు ఎవ రైనా వస్తే అతన్ని కూడా తమలో ఒక

డిగా కలుపుకునే వరకూ నిద్రపోరు"

"అదే నాకు ఆశ్చర్యం కలిగిస్తుంది. అవి నీతిపరులు అధికారంలో ఉన్నపుడు కూడా ఇన్ని గొడవలు జరగలేదు. నన్ను ఈ గద్దె మీద ఉంచటమే పాపమన్నట్లు అందరూ ప్రవర్తిస్తున్నారు"

"చెప్పాను కదా! మీరూ వారిలో ఒకరని నమ్మకం కలిగేదాకా అంతే!"

"క్షమించండి.. నేను ఏనాటికీ వారిలో ఒకడిని కాలేను"

"మరేమి చేస్తారు? "

"ప్రస్తుతం నాకేమీ తట్టటం లేదు. కానీ నాకు నమ్మకం ఉంది. ఆ దేవుడే నాకు దారి చూపిస్తాడు"

పెద్దగా నవ్వాడు ప్రభు. "మీకు దేవుడంటే అంత నమ్మకమా? "

"పూర్తిగా! మంచి చేయదలచుకున్న వారికి ఎవరి సాయం ఉన్నా లేకున్నా